క్యాంటీన్ స్థలం ఖరారుపై పునఃపరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

జనగామ, న్యూస్‌టుడే: 'లాభసాటి లేని చోట క్యాంటీనా?' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించారు. జనగామ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం, అందుబాటులో ఉన్న మున్సిపల్ ఆవరణలోని స్థలంలో ఏది లాభసాటిగా ఉంటుందో కథనంలో ప్రస్తావించిన సంగతి తెల్సిందే. ఈ విషయమై పునః పరిశీలన చేసేలా చూస్తామని కలెక్టర్ వివరించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి


కేజీబీవీలో సరకులను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

నర్మెట్ట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకొని ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్‌సింగ్ తండా కేజీబీవీ పాఠశాలను, స్థానిక ఆదర్శ పాఠశాలను డీఈవో కె.రాముతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులు ఎస్‌ఏ-1 పరీక్షలు రాస్తున్న తరగతి గదులను, తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన మెనూ అడిగి తెలుసుకున్నారు. తరగతి, హస్టల్‌లోకి దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు జాలీల ఏర్పాటు, తదితర ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసి, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతిగృహం వంటగదిలోని సరకులను పరిశీలించగా, కుళ్లిపోయిన ఉల్లిగడ్డలు, చిన్న సైజులో టమాటాలు ఉండడంతో, సరకులను అందించే కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీస్ అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐలయ్య, తహసీల్దార్ రామానుజాచారి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పుష్పకుమారి పాల్గొన్నారు.

పల్లె దారులకు మంచి రోజులు


జనగామ-నర్మెట్ట సుందరయ్యనగర్‌కు వెళ్లే దారికి రూ.3.74 కోట్లతో జరగనున్న పనులు

జనగామ, న్యూస్‌టుడే: వివిధ పథకాల నిధులతో గ్రామీణ ప్రాంత రహదారులకు కొత్త కళ రానుంది. రద్దీ అధికంగా ఉండే ఏక వరుస దారులను రెండు వరుస రహదారులుగా మార్చనున్నారు. ఆయా గ్రామాలను అనుసంధానించే కొన్ని ముఖ్యమైన రహదారులను గ్రామీణ రహదారుల నిర్మాణం(సీఆర్‌ఆర్) గ్రాంటుతో అభివృద్ధి చేసేందుకు పరిపాలన పరమైన ఆమోదం లభించింది. జనగామ జిల్లాలో సీఆర్‌ఆర్ గ్రాంటు కింద మూడు నియోజకవర్గాల పరిధిలో చేపట్టాల్సిన పనులకు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల నుంచి గతంలో ప్రతిపాదనలు స్వీకరించారు. ఇటీవలే ముఖ్యమైన దారుల అభివృద్ధికి నిధులు, పనులు మంజూరయ్యాయి.

☛ మూడు నియోజకవర్గాల్లో 12 పనులకు రూ.45.41 కోట్లు మంజూరయ్యాయి. జనగామ జిల్లాలోని ఈ నియోజకవర్గ గ్రామాలకు 5 రహదారుల అభివృద్ధికి రూ.29.04 కోట్లతో మంజూరి ఇచ్చారు. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రాష్ట్ర నిధులు(ఎస్డీఆర్‌ఎఫ్) రూ.215.57 లక్షలు, కేంద్ర నిధులు రూ.203.28 లక్షలతో పనులు జరగనున్నాయి.

మరమ్మతులకు నిధులు మంజూరు

☛ జనగామ నియోజకవర్గం జనగామ మండలం పెద్దబ్బాయిడీ రోడ్ నుంచి సుందరయ్యనగర్ రోడ్డు రూ.3.74కోట్లతో బీటీ రహదారి మంజూరైంది. బచ్చన్నపేట మండలం కట్కూరు నుంచి బండనాగారం వరకు రూ.5.80 కోట్లను వెచ్చించనున్నారు. ఎన్నాళ్ల నుంచో ఈ దారులను బాగు చేయాలనే డిమాండ్ ఎట్టకేలకు నెరవేరబోతోంది.

☛ పాలకుర్తి నియోజకవర్గం జనగామ జిల్లా పరిధిలోని పాలకుర్తి-కొడకండ్ల మండలాల అనుసంధాన రోడ్డులో ముత్తారం వెళ్లే దారిని రూ.3 కోట్లతో, మంచుప్పుల గుడి కుంట తండా మధ్య అనుసంధాన రహదారిని రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

☛ జిల్లాలో అనేక గ్రామాల రహదారుల విస్తరణ, మట్టి, మెటల్ రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. మరిగడి, గానుగుపహాడ్, వడ్లకొండ-పెద్దపహాడ్, ఎర్రగొల్లపహాడ్-అడవికేశవాపూర్, జనగామ-జీడికల్, కంచనపల్లి బాంజీపేట, వెల్ది, మాదారం రోడ్లను, బాంజీపేటలో కల్వర్టును బాగు చేయాల్సి ఉంది.

వివిధ పథకాల కింద మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనుల విషయమై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు చేపట్టాము. కొన్ని టెండరు దశలో ఉన్నాయి. రహదారుల అభివృద్ధి పనులు నిబంధనల మేరకు పూర్తయ్యేలా చూస్తామని జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ వివరించారు.

నియోజకవర్గాల వారీగా మంజూరైన పనులు/నిధులు(రూ.లక్షల్లో)	
జనగామ	రెండు/రూ.954.44
స్టే.ఘన్‌పూర్	ఒకటి/రూ.1500.00
పాలకుర్తి	రెండు/రూ.450.00


రఘునాథపల్లి నుంచి కంచనపల్లి నుంచి బానాజీపేట దారిలో ధ్వంసమైన లోలెవల్ వంతెనకు మోక్షమెప్పుడో?

ఘన్‌పూర్ నుంచి మల్లన్నగండి వరకు విస్తరణ..

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రం నుంచి మల్లన్న గండి వరకు సుమారు 16 కిలోమీటర్ల ఏక వరుస దారిని రెండు వరుసల బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీ నెరవేరనుంది. కొత్తపల్లి తాటికొండ, జిట్టగూడెం, మల్లన్న గండి మీదుగా తరిగొప్పుల వెళ్లడానికి ఇది ఉపయోగపడుతుంది. స్థానిక జలాశయం మీదుగా ఉన్న రహదారికి రెయిలింగ్ ఏర్పాటు చేస్తే జనగామ, స్టే.ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల ప్రయాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


ప్రస్తుతమున్న సింగిల్ రోడ్డు

☛ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో చిల్పూరు, ఘన్‌పూర్, జఫర్‌గఢ్, ఐనవోలు మండలాల పరిధిలో రూ.46 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని డీఈ రాజగోపాల్‌రావు వివరించారు.

వరద ప్రభావిత దారుల మరమ్మతుకు
ఎస్డీఆర్‌ఎఫ్- పనులు-56, నిధులు-రూ.215.57 లక్షలు
ఎన్డీఆర్‌ఎఫ్- పనులు-123 నిధులు-రూ.203.28 లక్షలు

అభివృద్ధిలో కడియం మార్కు చూపిస్తా


ఇప్పగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్‌లో అన్ని అభివృద్ధి పనులకు నవంబర్ చివరి మాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించి బహిరంగ సభ నిర్వహిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని, త్వరలో అభివృద్ధిలో కడియం మార్క్ చూపిస్తానన్నారు. కార్యక్రమంలో డీసీఓ రాజేందర్‌రెడ్డి, డీఏఓ రామారావు, పీఏసీఎస్ ఛైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ లావణ్య, వైస్ ఛైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు భాస్కుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా జన్మదినం నాటికి రుణ విముక్తి

లింగాలఘనపురం: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం డిసెంబర్ 9 నాటికి రైతులందరూ రూ.2 లక్షల పంట రుణాల నుంచి విముక్తులవుతారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. గుమ్మడవెల్లిలో కళ్లెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.2 లక్షలకు పైగా రుణాలున్న వారి కోసం మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అశ్వరావుపల్లి కుడి కాల్వ పనులు పూర్తి చేయించి మండలంలోని 9 గ్రామాలకు గోదావరి జలాలు అందించేందుకు అధికారులతో సమీక్షించానన్నారు. ఆర్డీవో కొమురయ్య, డీఏవో రామారావు, డీసీవో రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ బుషిగంపల ఉపేందర్, తహసీల్దార్ రవీందర్, ఎంఏవో వెంకటేశ్వర్లు, జనగామ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ బండ్లగూడెంలోని కేజీబీవీని కడియం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కల్పన అనే విద్యార్థిని పుట్టిన రోజు సందర్భంగా రూ.వెయ్యి కానుకగా అందించారు. ప్రత్యేకాధికారిణి అన్నపూర్ణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా, తదితరులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: రాజరికంలో రాజులు ప్రభువులుగా ఉంటారని.. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులనే విషయాన్ని గుర్తించి ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. జనగామ పట్టణం, రూరల్ పరిధిలో 93 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా పంపిణీ చేసి, మాట్లాడారు. నాయకులు పార్టీల బేధాలు లేకుండా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాజ్‌యాదవ్, తహసీల్దార్ వెంకన్న, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, భారాస నాయకుల వాగ్వాదం..

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భారాసకు చెందిన రెండో వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ అనిత మాట్లాడుతూ. . కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, ఇవ్వడం లేదని చెప్పడంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. భారాస హయాంలో దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి, ఫ్లెక్సీపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేకపోవడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువర్గాలను ఎమ్మెల్యే పల్లా శాంత పర్చడంతో సజావుగా ముగిసింది.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి


దేవునిగుట్టతండాలో తూకం వేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం దేవరుప్పుల మండలం మన్‌పహాడ్, దేవునిగుట్ట తండా, తూర్పుతండాతో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ధాన్యం మద్దతు ధరతో పాటు రూ.500ల బోనస్ అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నల్ల శ్రీరాం, నాయకులు ధర్మారెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

☛ మన్‌పహాడ్‌లో కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం సమావేశంలో వేదికపై తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర నాయకులు కూర్చొని ఉండగా ఏపీఎం వెంకట్‌రెడ్డి చేతులు కట్టుకొని నిలబడటం విడ్డూరంగా ఉందని మండల భారాస నాయకులు ఆరోపించారు.

న్యూడ్ కాల్ చేసి.. డబ్బులు అడిగి..

జనగామ టౌన్, న్యూస్‌టుడే: సామాన్య ప్రజలే కాకుండా కీలకమైన హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల వరకు సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. తాజాగా జనగామ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లోని ఓ శాఖకు చెందిన అధికారికి ఓ యువతి సెల్‌ఫోన్‌లో వీడియో కాల్ చేసి న్యూడ్‌గా మారి, తర్వాత అధికారిని సైబర్ నేరస్థులు డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వీడియోకాల్ చేసి న్యూడ్‌గా మారిపోతుండటంతో కంగారుపడిన అధికారి ఫోన్ కట్ చేశారు. ఇంతలోనే మాట్లాడిన వీడియో రికార్డును, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశామని తొలగించాలంటే ముందుగా రూ.35 వేలు పంపాలని కోరాడు. మరో అపరిచిత వ్యక్తి తాను సైబర్ క్రైమ్ అధికారిగా చెపుతూ వరుసగా అధికారిని భయపెట్టారు. పక్కనే ఉన్న ఇతర కార్యాలయ సిబ్బంది అనుమానం వచ్చి ఆయనను వారించడంతో ఫోన్ పెట్టేశాడు. ఈ విషయంపై సదరు అధికారి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుళ్ల బదిలీలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీలో పనిచేస్తున్న వారిని బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న శ్రవణ్‌కుమార్‌ను పాలకుర్తికి, భిక్షపతిని కొడకండ్లకు, సీసీఆర్‌బీ నుంచి టాస్క్‌ఫోర్స్ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను బచ్చన్నపేటకు బదిలీ చేశారు.

వైద్య కళాశాలలో హెల్త్ సైన్సు కోర్సులు


జనగామ టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులకు అనుబంధంగా హెల్త్ సైన్స్ కోర్సులను అభ్యసించడానికి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జనగామ వైద్య కళాశాలకు అనుబంధంగా డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్(2 సంవత్సరాల కోర్సు), డిప్లొమా ఇన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సు(2 సంవత్సరాలు)లను మంజూరు చేసినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దుగ్యాల గోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులకు ఇంటర్‌లో బైపీసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, వారు అందుబాటులో లేకుంటే ఎంపీసీ విద్యార్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. దరఖాస్తు వివరాలు వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో శనివారం నుంచి అందుబాటులో ఉంటాయని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని రఘునాథపల్లి, తరిగొప్పులలోని కేజీబీవీల్లో ఒక్కొక్క ఏఎన్‌ఎం పోస్టు, లింగాలఘనపురం, పాలకుర్తి, నర్మెట్ట, తరిగొప్పులలోని కేజీబీవీలలో ఖాళీగా ఉన్న ఒక్కొక్క అకౌంటెంట్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం పోస్టుకు ఇంటర్మీడియట్, ఏఎన్‌ఎం శిక్షణ సర్టిఫికెట్, అకౌంటెంట్ పోస్టుకు బి.కాం సర్టిఫికెట్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న మహిళలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు నవంబరు 5వ తేదీలోగా కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

దూది రైతుకు దుఃఖమే మిగిలింది!

ఈనాడు, వరంగల్, మహబూబాబాద్
ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



రైతు ఆశాజీవి.. ఎప్పటికైనా గిట్టుబాటు ధర రాకపోతుందా అని ఆరుగాలం కష్టించి పంట పండిస్తే చివరికి కన్నీరే మిగులుతోంది. ఈసారి అకాల వర్షాలు, చీడపీడల కారణంగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దానికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. మార్కెట్‌లో దళారులు, అధికారులు కుమ్మక్కై ధర తగ్గించి రైతును నిలువునా ముంచుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తిని అధికంగా పండించే అన్నదాతల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది.

● రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొస్తారు. శుక్రవారం ధర పడిపోవడంతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, రైతు సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులతో చర్చించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి రైతు సంఘాల నాయకులకు భరోసానివ్వడంతో.. ఆందోళన సద్దుమణిగింది. ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, మద్దతు ధర రూ.11 వేలకు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీసీఐ ప్రేక్షక పాత్ర..

వ్యాపారుల చేతుల్లో రైతులు నిలువునా మోసపోతున్నా.. భారత పత్తి సంస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో 8 నుంచి 12 తేమ శాతం రాదని తెలిసినా.. తేమశాతాన్ని పెంచేందుకు సీసీఐ నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చేతులెత్తేశారు. దాంతో వ్యాపారులు రైతుల కష్టాన్ని అగ్గువకే దోచుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ దళారులు అక్రమంగా పత్తి కొనుగోళ్లు చేస్తూ.. తిరిగి మార్కెట్‌లో అదే పత్తిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.


వేలం పాట నిర్వహిస్తున్న మార్కెట్ సిబ్బంది

మార్కెట్‌లో 'మద్దతు' కరవు

రూ.10 వేలకు అమ్మినా ఏమీ మిగలవు

- అడ్డాల కిషన్‌రావు, రైతు, రేవల్లె, దుగ్గొండి



నాకున్న రెండెకరాల్లో పత్తి వేశాను. శుక్రవారం 8 క్వింటాళ్ల వరకు పత్తి తీసుకువస్తే క్వింటాకు రూ.6600 చెల్లించారు. ఎకరా పత్తి తీయిస్తేనే రూ.4 వేల వరకు ఖర్చయింది. నాలుగుసార్లు పురుగుమందులు, ఇతరత్రా ఖర్చులు కలిపి చాలా ఖర్చయింది. క్వింటా పత్తి రూ.10 వేలకు అమ్మినా మాకు ఏమీ మిగలవు.

రవాణాకే రూ.5 వేలు చెల్లించాను

- రౌతు రాజయ్య, రైతు, కుంటపల్లి, సంగెం



మూడెకరాల్లో పత్తి వేస్తే తొలి కాపులో 15 క్వింటాళ్ల వరకు వచ్చింది. మార్కెట్‌కు తేవడానికి రూ.5 వేలు ఖర్చయింది. కూలీలు రూ.500 ఇస్తేగానీ రావడం లేదు. ఇక్కడ రూ.6500 కంటే తక్కువకే అడుగుతున్నారు. గతేడాది రూ.7 వేలకు పైగా ధర వచ్చింది.

రైతుల ఇబ్బందులపై వివరణ కోరగా

● పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కనీస తేమ 15 నుంచి 20 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామని అన్నారు.


● ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల మాట్లాడుతూ వ్యాపారులు తక్కువ ధరకు రైతుల నుంచి సరకును కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పంటను దున్నేస్తున్నారు...!

గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల ప్రభావం పత్తి రైతులను వెంటాడుతోంది. భారీ వర్షాల సమయంలో పత్తి పూత, పిందె రాలిపోయి తెగుళ్ల బారిన పడింది. చివరి ప్రయత్నంగా పురుగు మందులను పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది.



● నర్సింహులపేట మండలం జగ్గుతండా గ్రామశివారు చింతలతండాకు చెందిన రైతు బానోతు బాలాజీ మూడున్నర ఎకరాల్లో పత్తి వేశారు. రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం చేయగా భారీ వర్షాలతో పూత, పిందెలు రాలిపోయాయి. ఎరువుల దుకాణదారుల సూచన మేరకు పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం కానరాలేదు. పది క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. పంటకు గులాబీ పురుగు ఆశించడంతో శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి తొలగించారు.



● గోపాతండాకు చెందిన తాజా మాజీ సర్పంచి అజ్మీర లక్ష్మి రూ.60 వేలు వెచ్చించి రెండెకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పంట పూత, పిందెలు రాలిపోయి పెరుగుదల నిలిచిపోయింది. పురుగు మందులు వాడినా ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. తెగుళ్లు, వానరాల నుంచి కాపాడుకోలేక పంటను పశువులకు మేతకు వదిలేశారు..

–న్యూస్‌టుడే, నర్సింహులపేట

జిల్లాల వారీగా..	వరంగల్	జనగామ	భూపాలపల్లి	మహబూబాబాద్	హనుమకొండ	ములుగు	
	1,19,910	1,16,000	93,460	79,632	77,330	20,740	● ఎకరాలు
	7,19,460	6,96,000	5,60,760	4,77,792	4,63,980	1,24,441	● పత్తి దిగుబడి అంచనా (ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున)



వంతెన కూలింది.. కాలినడకే దిక్కైంది!

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు రాకపోకలు మెరుగుపర్చేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్మాణ పనులు జరుగుతుండగానే ఈ ఏడాది ఏప్రిల్, జులైలో రెండుసార్లు వంతెన గడ్డర్లు కూలిపోయాయి. 2016లో రూ.51.60 కోట్లు మంజూరు కాగా.. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో గాలి దుమారానికి ఏప్రిల్‌లో 2-3 పియర్ల మధ్యలో మూడు గడ్డర్లు, జులో 17-18 పియర్ల మధ్యలో 5 గడ్డర్లు కూలిపోయి ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో రెండువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.. కూలీ పనులకు వెళ్లేవారు వాగు వరద ప్రవాహంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.. వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

–ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే టేకుమట్ల



వీరు పెద్దపల్లి జిల్లా ఓడేడు గ్రామానికి చెందిన కూలీలు. నిత్యం 500 మంది వరకు వాగులో నుంచి నడుచుకుంటూ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి కూలీ పనులకు వస్తుంటారు. వాగు ప్రవహిస్తే ఇరువైపులా కాలినడక రాకపోకలు సైతం నిలిచిపోతాయి..

ఈ ప్రయాణం ప్రమాదం




పత్తి పంట దిగుబడులు వస్తుండటంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. హనుమకొండ జిల్లా పరకాల నుంచి నిత్యం వందలాది మంది మహిళా కూలీలు ట్రాక్టర్లు, ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. పరకాలలోని వెల్లంపల్లి రోడ్డులో గురువారం కొందరు మహిళలు ఇలా ఆటో వెనుక భాగంలో నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రమాదం జరగకముందే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పరకాల

నేడు ముదిరాజ్ కుల వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్




నర్సంపేట, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లి పందిరి.నెట్ ముదిరాజ్ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తోంది. నర్సంపేట కోర్టు హాలు వెనుక ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు అక్టోబరు 26, 27 తేదీల్లో (శని, ఆదివారాల్లో) ఉదయం 9 సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలి. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయాల్సిన వధూవరుల బయోడెటా, ఫొటోలు 83744 45190, 80080 02165 వాట్సాప్ నెంబర్లకు పంపించాలి. మరిన్ని వివరాలకు ఆ నంబర్లలో సంప్రదించాలి.



రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచే కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇది ఉమ్మడి వరంగల్‌కే తలమానికంగా నిలవనుంది. పలుకుబడుల కవితలతో ప్రజాకవిగా.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి దాతగా పేరొందిన ఓరుగల్లు ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కళలకు నిలయంగా ఇది వెలుగొందనుంది.

– న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం



ఓరుగల్లుకు మణిహారం..

- మొత్తం విస్తీర్ణం 4.2 ఎకరాలు
- నిర్మాణం 4 అంతస్తులు
- మొత్తం భవన నిర్మాణం 6172 చదరపు అడుగులు
- ప్రహరీతో పాటు గార్డెన్, పార్కింగ్ కలిపి 95,548 చ.అ
- వ్యయం రూ.95 కోట్లు

కాళోజీ కళాక్షేత్రం

● అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి



ఆడిటోరియంలో సభావేదిక, పైన విద్యుద్దీపాలు

ప్రాంగణం ఆహ్లాదకరంగా.. కళాక్షేత్రం ఆవరణలో ఆహ్లాదకరమైన గార్డెన్‌తో పాటు పార్కింగ్ సదుపాయం ఉంది. ఇందులో రకరకాల పూలు, అలంకరణ మొక్కలు నాటారు. లోపలికి వెళ్లగానే పచ్చని మొక్కలు స్వాగతం పలుకుతాయి. ప్రవేశమార్గంలో కాళోజీనారాయణ రావు విగ్రహం దర్శనమిస్తుంది.



రవీంద్రభారతికి దీటుగా : హైదరాబాద్ రవీంద్ర భారతికి దీటుగా ఆడిటోరియం ఉంటుంది. రవీంద్రభారతి ఆడిటోరియం సీటింగ్ సామర్థ్యం 980. అదే కళాక్షేత్రంలో 1127 కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇందులో అప్పర్ బాల్కనీలో 286 మంది కూర్చోవచ్చు. మిగతావి వరుస క్రమంలో కింద భాగంలో ఉంటాయి. సినిమా టాకీసును మించిన ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఆడిటోరియం లోపలికి వెళ్లగానే కళ్లు విప్పారుతాయి. సభావేదికపై కెనరా లైటింగ్స్ ఆడియో, వీడియో సెట్టింగ్స్ చేశారు. స్టేజి వెనుక, ఇరువైపులా బాలురు, బాలికల కోసం 4 గ్రీన్ రూమ్స్, అతిథులు, నిర్వహణ కోసం 12 గదులు ఉన్నాయి. ఒకేసారి 500 మందికి పైగా వేదికపై కూర్చునేలా భారీ వేదిక నిర్మించారు. ప్రవేశ మార్గంలో ఇరు వైపులా సువిశాలమైన కారిడార్స్ నిర్మించారు. నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఆధునిక జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియం లోపలికి వెళ్లడం, బయటకు రావడానికి రెండు వైపులా కలిపి ఆరు తలుపులు ఉన్నాయి.






కాళోజీ జ్ఞాపకాలతో ఆర్ట్ గ్యాలరీ


కాళోజీ నారాయణరావు తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న చిత్రాలు, ఆయన సాధించిన పురస్కారాలతో ప్రత్యేకంగా ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. జిల్లాలోని కవులు, కళాకారులతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా పొందిన పురస్కారాలు, సరదాగా ముచ్చటించిన అరుదైన చిత్రాలను ఇక్కడ చూడొచ్చు.





గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..

కాళోజీ నారాయణరావు 1930 నుంచి గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన అనేక పుస్తకాలు రచించారు. కవితలు, సూక్తులతో ప్రజలను చైతన్యపరిచారు. మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ బాషల్లో పండితుడు. అనేక ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయం, కాళోజీ కథలు, నా గొడవ, జీవనగీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! లాంటి అనేక కవితా సంపుటాలు రచించారు. ఆయన రచనలతో కళాక్షేత్రంలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే భావితరాలు వాటి గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉంది.





విద్యుత్తు తీగలకు.. ఊతమైన కర్ర

జనగామ మండలం మరిగడి గ్రామంలో పలు చోట్ల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో యమపాశాల్లా వేలాడుతున్నాయి. ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని రైతులు, వరి కోత యంత్రాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గానుగుపహాడ్-మరిగడి రహదారి పక్కన ఓ రైతు పొలంలో 11 కె.వి విద్యుత్తు తీగలు వేలాడుతుండగా, రైతు పైకి లేపేందుకు ఓ కర్రను ఏర్పాటు చేశారు ఇలా.. వర్షాలు కురిస్తే భూమికి ఎర్తింగ్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఎన్పీడీసీఎల్ జనగామ రూరల్ ఏఈ మధును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే మిడిల్ స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జనగామ రూరల్

నిలిచిపోయిన గూడ్స్ రైలు

కేసముద్రం, న్యూస్‌టుడే: విజయవాడ - కాజీపేట మార్గంలో వెళ్తున్న ఓ గూడ్స్ రైలు ఓవర్‌హెడ్ ఎలక్ట్రిఫికేషన్ (ఓహెచ్ఈ)లో సాంకేతిక లోపం ఏర్పడి తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య 428 కి.మీ., వద్ద శుక్రవారం ఉదయం 8.15 గంటలకు నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో రైలు ఇంజిన్‌ను కేసముద్రం నుంచి తెప్పించి ఆగిన గూడ్స్‌కు అమర్చడంతో 9.20 గంటలకు కదిలింది. ఆ మార్గంలో వెళ్తున్న పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహబూబాబాద్‌లో కోర్బా ఎక్స్‌ప్రెస్, సింగరేణి, డోర్నకల్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు సుమారు గంటపాటు నిలిచిపోయాయి.

ప్రజల అర్జీలు పరిశీలించిన మంత్రి సురేఖ



లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం వచ్చారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, ప్రజలు తరలివచ్చి మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందించారు. వరంగల్ వెంకట్రామా టాకీస్ సమీపంలోని శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనం కట్టి అద్దెకిచ్చారని మంత్రి దృష్టికి తెచ్చారు. కబ్జా అంశంపై వరంగల్ తహసీల్దారు ఎండీ ఇక్బాల్‌కు ఫోన్ చేసి మంత్రి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై తనకు పూర్తి వివరాలు కావాలని కోరారు. సమస్యల ఆధారంగా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు.

హరిత పర్వతాలు.. పైన హిమాలయాలు...!



అక్కడి పరిసరాలన్నీ హరిత వర్ణంతో ముసుగేసినట్లు కనిపిస్తాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న హిమాలయాలు లాగా హరిత కొండలు కనువిందు చేస్తాయి. ఆకాశం పైన ధవళ వర్ణంలో ఉన్న మేఘాలు మంచు కొండల్ని తలపిస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుపరాతి గుట్టల ప్రకృతి రమణీయత కట్టిపడేస్తోంది. ఈత చెట్టును ఆవాసంగా మార్చుకుని ఉన్న గిజిగాని పక్షుల గూళ్లు ఆకాశంలో ఉన్న భ్రాంతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామ శివారులో తీసిన సుందర చిత్రాలు. – ఈనాడు, హనుమకొండ



చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)

ఫాం:	115	డ్రెస్డ్:	199
రిటైల్:	137	స్కిన్‌లెస్:	226

కేఎంసీలో పరిశోధనోత్సవం ప్రారంభం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



అస్థిపంజరంతో ఫొటో..



సీపీఆర్‌తో ప్రాణాలు నిలపడం ఎలానో వివరిస్తూ..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవనంలో 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' (కృతి) రెండో పరిశోధనా దినోత్సవ సదస్సు శుక్రవారం మొదలైంది. రాష్ట్రంలోనే మొదటి సారి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతోపాటు పరిశోధనల వైపు మళ్లించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రం సహా, దేశం నలుమూలల నుంచి వచ్చిన వైద్యవిద్యార్థులు హాజరయ్యారు. కేఎంసీ యూఎస్ఏ అల్యుమిని, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్ కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి.బత్తిని అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్ క్విజ్) పోటీలు నిర్వహించారు. వైద్యపరిశోధనకు ఉపయోగపడేలా ఆటపాటలతో కూడిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ భవనం ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాళ్లలో జూనియర్ వైద్యవిద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వైద్య అవగాహన కల్పించారు. ఇందులో శరీర నిర్మాణం, డయాలసిస్ ద్వారా కృత్రిమ రక్తశుద్ధి విధానం, గుండె పనితీరు. కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తిని పీసీఆర్ చేయడం ద్వారా ఎలా బతికించొచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య పరికరాలు, విజ్ఞానానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లలో వైద్య పదజాలంతో కూడిన ఆటలు నిర్వహించారు.



వివిధ స్టాళ్ల వద్ద విద్యార్థులు

కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సుమలత

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం నూతన పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా సహ ఆచార్యులు సుమలత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు కె.వీనా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ల బోధనానుభవం ఉంది. ఎన్ఎస్ఎస్ అధికారిగా, హాస్టల్ అదనపు సంచాలకులుగా, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. ఉప కులపతి ఆచార్య కె.ప్రతాపరెడ్డి నుంచి ఆమె నియామక ఉత్తర్వులు అందుకున్నారు.



ఉప కులపతి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న సుమలత

సైకిల్ సవారీ.. ఆరోగ్యమేమరి..

సైకిల్‌పై రయ్‌మంటూ వెళ్తున్న యువకుడు హనుమకొండలోని వికాస్‌నగర్‌కు చెందిన తోకల రాజురెడ్డి. తాను రోజూ భవన నిర్మాణ అవసరాల నిమిత్తం నగరంలో సైకిల్‌పైనే సుమారు 40 కిలోమీటర్లు తిరుగుతానని చెబుతున్నారు. దీనికి బ్యాటరీతో కూడిన మోటారు కూడా ఉండటంతో 15 కిలోమీటర్లు తొక్కుతూ.. మిగతాది బ్యాటరీ మోటారు ఆన్‌చేసి వెళ్తుంటానని తెలిపారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయొచ్చని చెప్పారు. సైకిల్‌కు ఏడు గేర్లు ఉంటాయని, హ్యాండిల్‌కు వేగాన్ని సూచించే డిజిటల్ మీటరు కూడా ఉంటుందన్నారు. ఇది వరకు తనకు బుల్లెట్ బండి ఉండేదని, దానికి ఇంధన ఖర్చు ఎక్కువ అవుతుండటంతో రెండు నెలల కిందట రూ.50 వేలు వెచ్చించి ఈ సైకిల్ కొన్నానని తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.3 వేలకుపైగా ఆదా అవుతోందని, సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నానని ఉత్సాహంగా చెప్పారు. – ఈనాడు, హనుమకొండ



డిజిటల్ మీటర్



కల్యాణలక్ష్మి పేదలకు వరం


బచ్చన్నపేటలో చెక్కుల పంపిణీలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట, జనగామ టౌన్, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలువురికి మంజూరైన 42 కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం గత భారాస ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలనందించిందన్నారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన నీలిమా ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. చెక్కుల పంపిణీ ఉందని చెప్పి ప్రోగ్రామ్ ఖరారు చేసినా, కొందరు కాంగ్రెస్ నేతలు క్యాన్సల్ అయిందని రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను వెల్లగొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ విషయమై తహసీల్దార్ మహిపాల్‌రెడ్డిని భారాస నేతలు నిలదీయగా తిరిగి చెక్కుల పంపిణీ రూట్ క్లియర్ అయింది. కార్యక్రమంలో రైబస మాజీ జిల్లా కన్వీనర్ ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, వైస్ ఛైర్మన్ మద్దికుంట రాధ, భారాస మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే జనగామ నియోజకవర్గంలోని 70 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

వివరాల సవరణ తరువాయే అపార్

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పాఠశాలలో విద్యార్థి ప్రగతి, ఆధార్ నంబర్ మినహా సమస్త వివరాల వేదికకు విద్యా శాఖ 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు అప్రయత్నంగా నమోదు చేయడంతో పాటు 12 అంకెల విశిష్ట సంఖ్య గల గుర్తింపు సంఖ్య కోసం విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. పలువురు విద్యార్థులకు ఆధార్ కార్డులో వివరాలు తేడాగా ఉండడం వీటిని సరిచేసాక, యూడైస్ ప్లస్‌లో సవరించాక చివరగా అపార్‌లో నమోదుకు అధికారులు ప్రధానోపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. అపార్‌లో నమోదయ్యాక మార్పుల సవరణకు కుదరదని అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని బడుల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి వివరాలను పరిశీలిస్తున్నారు.

ప్రయోజనం అధికం..

ఇటీవల కురిసిన ఖమ్మం వంటి జిల్లాల్లో పలు నివాస ప్రాంతాలు మునిగి, లోపల ఉన్న విద్యా పరమైన సర్టిఫికేట్లు పనికిరాకుండా పోయాయి. తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకున్నా, అపార్‌లో వివరాల నమోదు, 12 అంకెల విశిష్ట సంఖ్యతో సమస్త వివరాలు, సర్టిఫికేట్లు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి. ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకున్నపుడు ఆధార్ నెంబరు సహా వివిధ అర్హతల ధ్రువపత్రాల నకళ్లను సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆధార్ నెంబరును గోప్యంగా ఉంచడంతో పాటు అవసరమైన వివరాలే కనిపించేందుకు ఈ అపార్ అందుబాటులో ఉంటుంది. విద్యార్థి ప్రభుత్వం నుంచి పొందిన ఉపకార వేతనాలు, ఫీజు రాయితీలు తదితరాలు సహా అన్ని సర్టిఫికేట్లు ఇందులో నిక్షిప్తమై ఉంటాయి.


విద్యార్థి వివరాలు సరిచేస్తున్న మాధాపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్

☛ మూడు దశల్లో సవరణ చేయాలని అధికారులు ఉపాధ్యాయులకు చెబుతున్నారు. అడావుడి లేకుండా స్పష్టమైన వివరాలు భర్తీ చేయాలని సూచిస్తున్నారు.

వివరాలిలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
జనగామ	508	65,206
భూపాలపల్లి	432	20,870
ములుగు	510	32,082

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 67702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని విస్సూరుకు వెళ్లే మార్గంలో పలు మురుగు కాల్వల్లో పూడికమట్టి, చెత్తాచెదారం పేరుకుపోయింది. - రంజిత్

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - వెంకటేశ్వరాచారి, పంచాయతీ కార్యదర్శి

దేవరుప్పుల రూరల్: మండలంలోని కోలుకొండలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అలాగే మురుగు కాల్వలు, రోడ్లు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పరిష్కరించాలి. - వేణుశర్మ, గ్రామస్థుడు

సమాధానం: పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తాం. - సురేశ్‌కుమార్, ఎంపీవో, దేవరుప్పుల

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మసీదు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంది. - చారి, పాలకుర్తి

సమాధానం: సిబ్బందితో ఏర్పాటు చేయిస్తాం. - వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం

మురుగు కాలువలు శుభ్రం

నర్మెట్ట: నర్మెట్ట 5వ వార్డులోని మురుగు కాలువ వ్యర్థాలతో నిండి, మురుగు రోడ్డుపై ప్రవహించడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు తెలిపారు. సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.

నర్మెట్ట: మండలంలోని మచ్చుపహాడ్ గ్రామంలోని 2వ వార్డులో మురుగు కాల్వ వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తుండడంతో సమస్యను కాలనీ వాసులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వంశీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.

పైపులైన్‌కు మరమ్మతు

తరిగొప్పుల: తరిగొప్పుల గ్రామం రెండోవార్డులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా వెళ్తున్నాయని, సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మికి వివరించింది. ఆమె సానుకూలంగా స్పందించి సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతు చేయించారు.

చెత్త తొలగింపు



బచ్చన్నపేట: బచ్చన్నపేట మండల కేంద్రంలోని గడ్డిమైసమ్మ నుంచి బీడీ కంపెనీకి వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా తయారైందని 'దారంతా చెత్తమయం' శీర్షికన ఈనాడులో గురువారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో మల్లిఖార్జున్ స్పందించారు. వెంటనే చెత్త తొలగించి, శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శి నర్సింహ్మాచారిని ఆదేశించడంతో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో కాలనీవాసులు 'ఈనాడు'కు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులపై సానుభూతి ప్రదర్శించాలి..


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: దివ్యాంగుల పట్ల సానుభూతి చూపడం కన్నా సహానుభూతి(సాటి మనిషిగా) ప్రదర్శించాలని తెలంగాణ వికలాంగుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల సమ్మయ్య అన్నారు. వికలాంగుల హక్కుల చట్టం-2016లోని 91, 92 సెక్షన్ల ప్రాముఖ్యతను కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వివరించి సంబంధిత ప్రతులను ఆయనకు అందజేశారు. తదనంతరం చట్టంకు సంబంధించిన గోడపత్రికలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సుమతి, సంపత్, సుధాకర్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ జగన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ.. విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్, రవి, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని ఎమ్మార్వో హుస్సేన్‌కు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని ఉమ మాట్లాడుతూ.. రియింబర్స్‌మెంట్‌తో సంబంధం లేకుండా చదువు పూర్తి చేసిన ధ్రువపత్రాలు అందించాలని కోరారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి, తమను ఆదుకోవాలని అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు సింధూజ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1,654 మంది చాలీచాలని వేతనాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు బోధిస్తున్నామని, కానీ ఐదు నెలలు గడుస్తున్నా వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో స్రవంతి, రాజు, ఇస్సాక్, వసీమా సుల్తానా, సత్యనారాయణ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జీడికల్‌లోని వీరాచల రామచంద్రస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. హుండీల కానుకలు, వేలం పాట ద్వారా రూ.2.83 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో వంశీ తెలిపారు. హుండీల ఆదాయం రూ.88,365, లడ్డూ, పులిహోర అమ్మకాల వేలానికి రూ.1.85 లక్షలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, ఈవో వంశీ, సిబ్బంది భరత్, మల్లేశ్, శంకర్, రాజేందర్‌రెడ్డి, రమేశ్, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 26న వరంగల్‌లో నిర్వహించనున్న ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక ఆదాం మాదిగ అన్నారు. జఫర్‌గఢ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి రవీందర్, మహేందర్, నవీన్, యాకనాథం, చంద్రయ్య, సమ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


నర్సింగాపురంలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల, పాలకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు క్రయవిక్రయాలు జరపాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం కొడకండ్ల మండలంలోని మొండ్రాయి, నర్సింగాపురం, పాలకుర్తి మండలంలోని తీగారం, ముత్తారం, లక్ష్మీనారాయణపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కేంద్రాల్లో రైతులకు పూర్తి సౌకర్యాలందించాలని నిర్వాహకులను, అధికారులను ఆదేశిస్తూ అసౌకర్యం కలిగిన రైతులు నేరుగా తనకు సమాచారమందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు సురేష్‌నాయక్, కుమారస్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జనగామ సబ్ డివిజన్ పోలీసులు, రెడ్‌క్రాస్, జనరల్ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ.. రక్తదానం చేసే వారంతా ప్రాణదాతలేనన్నారు. రక్తదానం చేయడానికి ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు యువజన సంఘాలు, అసోసియేషన్లు, లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు 221 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనగామ ఏసీపీ పార్థసారథి, జనగామ, నర్మెట్ట సీఐలు దామోదర్ రెడ్డి, అబ్బయ్య, ఎస్సైలు ఎస్.కె. హమీద్, రాజేష్, చెన్నకేశవులు, శ్వేత, రాజన్‌బాబు, వైద్యులు కరుణాకర్‌రాజు, దివ్య, పలు సంస్థల ప్రతినిధులు కన్నా పరశురాములు, లవకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌ఛార్జి శంకర్, మండల అధికారి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆయిల్‌పామ్ సాగు, సస్యరక్షణపై శుక్రవారం వనపర్తిలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతర పంటల సాగుతో అదనపు లాభాలు వస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీ, బీసీలకు, 5 ఎకరాల లోపు భూములున్న రైతులకు 90 శాతం, 5 ఎకరాల పైబడిన భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏఈవో శ్రీనివాస్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



కొడకండ్ల, న్యూస్‌టుడే: కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మహ్మద్ గౌస్ ఇటీవల మృతి చెందగా, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో ఆయనతో పదో తరగతి చదువుకున్న మిత్రులు కుటుంబానికి చేయూతనందించి, స్నేహం గొప్పతనాన్ని చాటుకున్నారు. కొడకండ్లలోని మృతుడి కుటుంబాన్ని వారు పరామర్శించి, రూ.75వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు పొన్నం వెంకన్న, ప్రవీణ్‌కుమార్, శశిధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కోతులపై మానవత్వం చూపిన యువకులు

జనగామ టౌన్: జనగామ పట్టణంలోని గుండ్లగడ్డలో శుక్రవారం సాయంత్రం కోతుల గుంపు రావడంతో పలువురు ఆకతాయిలు వాటిపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఓ తల్లి కోతి, మరో పిల్ల కోతికి తీవ్ర గాయాలై అక్కడే పడిపోయాయి. దీంతో కాలనీవాసులు చుంచు శ్రీకాంత్, మరికొందరు యువకులు వెంటనే వెటర్నరీ వైద్యులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న వెటర్నరీ వైద్యుడు శ్రీనివాస్, సహాయకుడు నితిన్ తీవ్ర గాయాలైన కోతులకు చికిత్స అందించారు. దీంతో కొద్దిసేపటికి తేరుకున్న కోతులు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. యువకులను పలువురు అభినందించారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ శుక్రవారం సీపీఎం కార్యకర్తలు మండలంలోని తమ్మడపల్లి(జి) నుంచి జఫర్‌గఢ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర, ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. తహసీల్దార్ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా నాయకురాలు ఎండీ షభానా, మండల నాయకులు సుధాకర్, రాజు, యాకయ్య, గంగరాజు, రోజా, నర్సింగ్, శ్రీనివాస్, సాయి, రేణుక, శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య శిబిరం

జనగామ రూరల్: మండలంలోని పసరమడ్ల శివారులోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.లచ్చిరాం, వైద్యులు జి.ప్రసాద్, పి.అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలయ్య సేవలు చిరస్మరణీయం

జనగామ రూరల్: ప్రజా సేవ కోసం పరితపించే వారు ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచిపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని గానుగుపహాడ్‌లో సీపీఎం సీనియర్ నాయకులు కూకట్ల బాలయ్య(85) అనారోగ్యంతో మృతి చెందగా, భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను కనకారెడ్డి శుక్రవారం పరామర్శించి, భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. బాలయ్య జిల్లాలో చేసిన ప్రజా పోరాటాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి, ఉపేందర్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళా ప్రదర్శనలు

జనగామ టౌన్: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ కళాకారులు శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. హెచ్ఐవీ. కలుషితమైన రక్తమార్పిడి, సూదులు, సిరంజిలతో వస్తుందని అవగాహన కల్పించారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రాం అధికారి స్వామి కళాకారులు సందీప్, అర్జున్, కృష్ణంరాజు, చిరంజీవి, రజిని పాల్గొన్నారు.

మంత్రి సురేఖ సైకిల్ సవారీ



రామన్నపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విద్యార్థి దశ రోజులు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆంధ్రా బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థినులకు మంత్రి సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణగౌడ్ సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి విద్యార్థినులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద సైకిల్ తొక్కి సందడి చేశారు. విద్యార్థినులతో స్వీయ చిత్రాలు దిగారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మైనారిటీ బాలికల గురుకుల కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఇంగ్లిషు సబ్జెక్టును బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి బి.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఇంగ్లిష్ సబ్జెక్టులో 50శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి, బీఈడీ అర్హతతో పాటు బోధనలో మూడేళ్ల అనుభవం ఉన్న 44 సంవత్సరాలలోపు వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30న సాయంత్రం 4.30గంటలలోపు కలెక్టరేట్‌లోని మైనారిటీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ధర్నా గోడప్రతుల ఆవిష్కరణ

తొర్రూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్‌లు ఐకాసగా ఏర్పడి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమ గోడప్రతులు శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. మహాలక్ష్మీ పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్‌లకు నెలకు రూ.12 వేలు అందిస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు ఇవ్వాలన్నారు. ధర్నాకు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్మికులు మల్లేశ్, మోహన్, సాయి, ఉపేందర్, అరవింద్, రవి తదితరులు పాల్గొన్నారు.

నగదు పోగొట్టుకున్న వైద్య విద్యార్థి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన తిరునగరి శశాంక్ అనే వైద్య విద్యార్థి శుక్రవారం ఎంబీబీఎస్ సీట్‌కు సంబంధించి డీడీ తీసేందుకు ఇంటివద్ద నుంచి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌కు రూ. లక్ష నగదును జేబులో పెట్టుకొని వెళ్లాడు. బ్యాంక్ వద్ద చూసుకునేసరికి రూ.50 వేలు మాత్రమే ఉన్నాయి. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శశాంక్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని వావిలాల శివారులో మూలమలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ట్రాలీ ఆటో, కారు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో వరంగల్‌కు చెందిన ఆటో డ్రైవర్ తిరుమలేష్, హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మాజీ, సత్యవతి, మహాలక్ష్మిలు ఎదురెదురుగా వెళ్తుండగా, ఈ ఘటన చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం పాలకుర్తి వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డిలు వెంటనే స్పందించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

ఒకరి దుర్మరణం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: లింగాలఘనపురం మండలం నెల్లుట్ల శివారులోని వడ్డెరకాలనీ సమీపంలో శుక్రవారం ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టిన ప్రమాదంలో పెంచల ఆగయ్య(80) మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం పెద్దకోడెపాకకు చెందిన పెంచల ఆగయ్య, సరోజన దంపతులు శుక్రవారం కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. రోడ్డుపై ఆగి ఉన్న మరో కారును వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆగయ్య అక్కడికక్కడే మృతి చెందగా సరోజనకు, కారు డ్రైవర్ వినోద్, మరొకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల సాధన, సంక్షేమానికి రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు జయప్రకాష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం సహించం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, వేదికపై డీసీపీలు షేక్‌సలీమ, రాజమహేంద్రనాయక్, రవీందర్ అదనపు డీసీపీ రవి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఠాణాల వారీగా నమోదైన కేసులు, నిందితుల అరెస్టు, కేసు విచారణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఠాణాల పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలపై ముందస్తు సమాచారం అధికారులు సేకరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే కథనాలపై దృష్టి పెట్టాలని సూచించారు. వదంతులను వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై నిఘా పెంచాలన్నారు. ఎవరైనా బాధితులు కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసినా వాటిని ఆయా ఠాణాలకు పంపిస్తున్నామని, వాటిపై సమగ్రంగా విచారణ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ యాంటి డ్రగ్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందికి రివార్డులను అందించారు. డీసీపీలు షేక్ సలీమ, రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీ రవి తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' ఆవిష్కరణల్లో ఉమ్మడి వరంగల్‌కు మూడో స్థానం

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కేంద్రం 'ఇన్‌స్పైర్' వేడుకలను నిర్వహిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహిస్తారు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఆవిష్కరణలకు నామినేషన్లు ఆహ్వానించారు.. ఉమ్మడి వరంగల్ ఆవిష్కరణల సంఖ్యా పరంగా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. విద్యార్థులు తమ పరిసరాలు, స్థానిక అవసరాలు తదితరాలు పరిగణనలోకి తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాల్సి ఉంటుంది. నిపుణులు పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఇలా ప్రాథమిక దశలో తయారుచేసే ప్రయోగాల ఖర్చుల కింద రూ.10 వేలు విద్యార్థి బ్యాంకు పొదుపు ఖాతాలో జమచేస్తుంది. గతంలో కంటే సృజనాత్మకత ఉన్న అంశాల ఆవిష్కరణలే విద్యార్థులు ప్రాథమికంగా తయారు చేశారని జనగామ జిల్లా విద్యాశాఖ సైన్సు అధికారి పాకనాటి రఘునందన్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా నుంచి అందిన నామినేషన్లు

జిల్లా	ప్రదర్శనల సంఖ్య
వరంగల్	1,592
హనుమకొండ	1,193
మహబూబాబాదు	1,074
జనగామ	754
భూపాలపల్లి	515
ములుగు	351